

ఎంపీ ఈటలకు వినతి పత్రం అందజేసిన 'డబుల్' ఇళ్ల లబ్ధిదారులు

'డబుల్' ఇళ్ల వద్ద కనీస సదుపాయాలు కల్పించండి

ముషీరాబాద్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద తాగు నీరు, డ్రైనేజీ, విద్యుత్ సదుపాయాలు కల్పించాలని ఎంపీ ఈటల రాజేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన వారికి శామీర్‌పేటలో నిర్మించి ఇచ్చిన డబుల్ బెడ్‌రూం ఇళ్లలో కనీస సదుపాయాలు కల్పించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు ఇచ్చారు తప్పా కనీస సదుపాయాలు కల్పించలేదని మండి పడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పేదల డబుల్ బెడ్‌రూం ఇళ్లకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఎంపీని కలిసిన వారిలో శామీర్‌పేట్ డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీరేందర్, ద్వారకానంద్, నాయకులు విశ్వనాథ్, మల్లేష్, వెంకటేష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



తాగునీటి ఎద్దడిపై స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

కాచిగూడలో తాగునీటి ఎద్దడిని నివారించండి

బర్కత్‌పుర, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌లో తాగునీటి ఎద్దడిని నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులకు కార్పొరేటర్ కన్నె ఉమాదేవి సూచించారు. సోమవారం డివిజన్ పరిధిలోని మణియార్‌పట్టీ, మోతీమార్కెట్, నిబోలిఅడ్డ, బర్కత్‌పుర తదితర ప్రాంతాలలో పాదయాత్ర నిర్వహించి మంచి నీటి ఎద్దడిపై స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు నల్లాల ద్వారా తాగునీరు సరిగ్గా రావడంలేదని, బిందెడు నీళ్లకోసం నానా ఇబ్బందులు పడుతున్నామని కార్పొరేటర్‌కు మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అన్ని ప్రాంతాలకు సమానంగా మంచినీటి సరఫరా చేయకపోతే జలమండలి అధికారులను ఎక్కడికక్కడ నిలదీస్తామని ఆమె హెచ్చరించారు. ఇదే ఎద్దడి కొనసాగితే స్థానిక ప్రజలతో నారాయణగూడలోని జలమండలి కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్‌యాదవ్, నాయకులు వాసు, బీమ్ రాజ్, రవియాదవ్, సూరి, సంతోష్, రామకృష్ణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ప్రకాష్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అరవింద్‌కుమార్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్

ఆపదలో ఉన్న కాంగ్రెస్ నేతలకు అండగా ఉంటాం

ముషీరాబాద్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నేతలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్ యాదవ్ అన్నారు. సోమవారం ముషీరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఆవుల ప్రకాష్ సంతాపసభను ముషీరాబాద్ డివిజన్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అరవింద్ కుమార్ యాదవ్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఆవుల ప్రకాష్ పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎంతో కృషిచేశారని కొనియాడారు. ఈ సందర్భంగా ఆవుల ప్రకాష్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెండం శ్రీనివాస్ యాదవ్, నగర కార్యదర్శి తమగొండ రాజ్‌దీప్, నగర ప్రధాన కార్యదర్శి లింగాల శ్రీకాంత్ గౌడ్, నాయకులు చారి, మురళీమోజెస్, రమేష్ గౌడ్, అమర్‌నాథ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

'ఇంటి నిర్మాణదారులను వేధిస్తున్న వారిపై చర్యలు తీసుకోండి'

రాంనగర్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఇంటి నిర్మాణదారులను బ్లాక్‌మెయిల్ చేస్తూ వేధింపులకు గురిచేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని, తమకు వారి నుంచి భద్రత కల్పించాలని భాగ్యనగర్ మున్సిపల్ జీహెచ్ఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్, ప్రధాన కార్యదర్శి షేక్ అస్రాఫ్ వలి కోరారు. ఈ మేరకు సోమవారం సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు వారు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబర్‌పేట సర్కిల్ పరిధిలోని పలువురు బ్లాక్‌మెయిలర్లు ఇంటి యజమానులతో పాటు తమను వేధిస్తున్నారని వాపోయారు. తమను విధులు నిర్వహించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఇలాంటి సంఘ వ్యతిరేక శక్తులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, జీహెచ్ఎంసీ కమిషనర్, నగర పోలీసు కమిషనర్లకు వినతిపత్రాలు సమర్పించినట్లు వారు తెలిపారు.

'దాడులు, బహిష్కరణల నివారణకు చర్యలు తీసుకోండి'

రాంనగర్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): బీసీ, ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులు, బహిష్కరణలు, హత్యల నివారణకు చర్యలు తీసుకోవాలని బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్‌కు కుల నిర్మూలన వేదిక అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, బాలకృష్ణ, తెలంగాణ మాదిగ జర్నలిస్టుల ఫోరం అధ్యక్షుడు బూర్గుల నాగేందర్ సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రోజురోజుకు ఎస్సీ, ఎస్టీ, బీసీలపై ఆధిపత్య కులాలు, పెత్తందారులు, ధనికవర్గాల దాడులు, బహిష్కరణలు, హత్యలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. వీటిని అరికట్టేందుకు బీసీ కమిషన్ కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



సన్మానం

ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన అద్దంకి దయాకర్‌ను బీసీ సంఘాల నేతలు సోమవారం కలిసి శాలువతో ఘనంగా సత్కరించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ, జాతీయ ప్రధాన కార్యదర్శి కోల జనార్దన్, జాతీయ ఉపాధ్యక్షురాలు మట్టా జయంతి గౌడ్, నాయకులు నందగోపాల్, ఉదయ్‌నేతలు సన్మానించిన వారిలో ఉన్నారు.

- (బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో ఉద్యోగులకు జీతాలు ఇచ్చే పరిస్థితి లేదు

● ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ ● ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



గగన్‌మహల్‌లో బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీ కె.లక్ష్మణ్

ముషీరాబాద్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉందని, ఉద్యోగులకు జీతాలు ఇచ్చే పరిస్థితి లేదని ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ ఆరోపించారు. అప్పులకోసం చిప్పపట్టుకొని ఢిల్లీకి వెళ్లి అడుగుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డిపై ఆయన ధ్వజమెత్తారు. సోమవారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ముషీరాబాద్ డివిజన్‌లోని జాంభవి నగర్‌లో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కంచిముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీజేపీ జెండాను కె.లక్ష్మణ్ ముఖ్యఅతిథిగా హాజరై కార్పొరేటర్ సుప్రియా నవీన్ గౌడ్‌తో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో అమలుకు నోచుకోని హామీలను ప్రజలకు ఇచ్చి వాటిని నెరవేర్చకుండా అప్పుల కోసం కేంద్రాన్ని చేయిచాపడం ఎంతవరకు సమంజసం అన్నారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్, బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్, నియోజకవర్గ కన్వీనర్ రమేష్‌రాం, జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పూసరాజు, బీజేవైఎం నాయకులు అనిల్‌కుమార్, కుషాల్‌గౌడ్, ఆయూష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో బీజేపీదే అధికారం

కవాడిగూడ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడానికి దోహదపడతాయని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కవాడిగూడ డివిజన్ బూత్ నంబర్ 50 వద్ద ఏర్పాటుచేసిన బీజేపీ జెండాను కార్పొరేటర్ జి రచనశ్రీ, ఓబీసీ మోర్చానగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి ఎంపీ లక్ష్మణ్ ఎగుర వేశారు. ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షుడు సలంద్రి సంకీర్త యాదవ్, మహంకాళి జిల్లా బీజేపీ అధ్యక్షుడు భరత్‌గౌడ్, ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ టి.రవీందర్, ముషీరాబాద్ బీజేపీ కన్వీనర్ ఎం.రమేష్, రామ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్ డివిజన్‌లో

చిక్కడపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): బీజేపీ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం గాంధీనగర్ డివిజన్ కెనరా బ్యాంక్ వద్ద జరిగిన కార్యక్రమంలో బీజేపీ ఎంపి డాక్టర్ కె.లక్ష్మణ్ ముఖ్యఅతిథిగా పాల్గొని స్థానిక కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్‌తో కలిసి పార్టీ జెండాను ఎగురవేశారు. ఈసందర్భంగా డా. లక్ష్మణ్ మాట్లాడుతూ నమ్ముకున్న సిద్ధాంతం కోసం పనిచేస్తున్న ఏకైక పార్టీ బీజేపీ అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ లోక్‌సభ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్, అసెంబ్లీ కన్వీనర్ రమేష్‌రామ్, డివిజన్ అధ్యక్షుడు నవీన్‌కుమార్, బాలస్వామి, రత్నసాయిచంద్, శ్రీకాంత్, మీఎస్టీ రాజు, నర్సింగ్‌రావు, ఉమేష్, సురేందర్, మహమూద్, లక్ష్మణ్ యాదవ్, నర్సింహ, దోనేటి సత్యం, ఆనంద్‌రావు, అరుణ్‌కుమార్, సంధ్యారాణి, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

రాంనగర్ డివిజన్‌లో

రాంనగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్‌లోని హరినగర్ చౌరస్తాలో సోమవారం బీజేవైఎం మహంకాళి అధ్యక్షుడు మద్దూరి శివాజీ ఆధ్వర్యంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకలకు ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ ముఖ్యఅతిథిగా హాజరై పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి పార్టీ వ్యవస్థాపక నాయకుల చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు జి.భరత్‌గౌడ్, ముషీరాబాద్ కన్వీనర్ రమేష్‌రామ్, నాయకులు గడ్డం నవీన్, రాంరెడ్డి, శక్తిసింగ్, ఆర్.జనార్దన్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేటలో

అంబర్‌పేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అంబర్‌పేటలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రేమ్‌నగర్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు దాసోజు నాగభూషణం చారి, రాజు, భిక్షపతి, యశ్వంత్, దయాకర్‌యాదవ్, భాస్కర్‌గౌడ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్

గోల్నాక, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా 25మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.12లక్షల75వేల విలువైన చెక్కులను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పంపిణీ చేశారు. సోమవారం గోల్నాక తులసీనగర్‌కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబర్‌పేట నియోజకవర్గంలో అర్హులైన వారందరికీ సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎ.సురేష్‌గౌడ్, ఎన్.లింగంయాదవ్, ఎం.అరుణ్‌కుమార్‌రెడ్డి, మిర్యాల రవీందర్, చంద్రశేఖర్, మరేష్‌నాయక్, మహ్మద్ యూసూపోద్దీన్, మల్లేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల పట్టాభిషేకం, చక్రస్నానాలు



అంబర్‌పేటలో జరిగిన సీతారాముల పట్టాభిషేకంలో పాల్గొన్న వి.హనుమంతరావు, శంభుల శ్రీకాంత్‌గౌడ్ తదితరులు

రాంనగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాలలోని పలు ఆలయాలు, సంఘాల ఆధ్వర్యంలో సోమవారం శ్రీసీతారాములు పట్టాభిషేకం, చక్రస్నానాలు, ఒడిబియ్యం వంటి కార్యక్రమాలు కన్నులపండువగా నిర్వహించారు. అంబర్‌పేటలో జరిగిన శ్రీసీతారాముల పట్టాభిషేకంలో మాజీ ఎంపీ వి.హనుమంతరావు, టీపీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. రాంనగర్ రామాలయంలో జరిగిన శ్రీసీతారాముల పట్టాభిషేకం, చక్రస్నానాల కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఆనంద్ ముదిరాజ్ మాజీ చైర్మన్ రవియాదవ్, ధర్మకర్తలు యాదగిరి, గోవర్ధన్‌రెడ్డి, మీనా పాల్గొన్నారు. రాంనగర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీసీతారాముల పట్టాభిషేకం, చక్రస్నానాలు, సామూహిక శ్రీసత్యనారాయణస్వామి వ్రతాలు, ఒడిబియ్యం వంటి కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వెలిశెట్టి సుధాకర్‌గుప్తా, నేతి సత్యనారాయణ, కోశాధికారి ఎర్రం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అడిక్‌మెట్‌లోని శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో స్వామి వారి పట్టాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో, చైర్మన్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

చిక్కడపల్లి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం పునర్‌నిర్మాణ తృతీయ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం శ్రీరామపట్టాభిషేకం కనులపండువగా జరిగింది. ఆలయ ఈవో దేవనాథం, పునర్‌నిర్మాణ కమిటీ చైర్మన్ జానకి సుధాకర్, ముఖ్యఅర్చకులు బుగ్గా లక్ష్మీపతిశర్మ, సిబ్బంది ఏర్పాట్లు పరిశీలించారు. ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని శ్రీలక్ష్మీగణపతి దేవాలయంలో శ్రీరామపట్టాభిషేకం కార్యక్రమాన్ని ఆలయ పునర్‌నిర్మాణ కమిటీ చైర్మన్ మారిశెట్టి నర్సింగ్‌రావు, ఈవో లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

కవాడిగూడలో సీతారాముల రథోత్సవం



కవాడిగూడ డివిజన్ దోమలూడలోని హన్‌మాన్ ఆలయంలో సీతారాముల కల్యాణం అనంతరం నిర్వహించిన రథోత్సవంలో బీఆర్ఎస్ రాష్ట్ర యువజన విభాగం రాష్ట్ర నాయకులు ముఠాజైసింహ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దేవాలయ మాజీ చైర్మన్ గొల్లగడ్డ రాజశేఖర్‌గౌడ్, బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎన్‌డీ సాయికృష్ణ, బీఆర్ఎస్ నేతలు వాసు, మధు, అలయ అర్చకులు మహేందర్ తదితరులు

- కవాడిగూడ ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి)

అక్షర నీరాజనం పుస్తకావిష్కరణ

రాంనగర్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కెనడా ప్రవాస భారతీయుడు, వరంగల్‌కు చెందిన డాక్టర్ నెళ్లుట్ల నవీన్‌చంద్రపై 50 మంది రచయితలు రాసిన అక్షర నీరాజనం పుస్తకావిష్కరణ సోమవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ సాంస్కృతిక వేదికలో జరిగింది. వేదిక అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ప్రముఖ రచయిత్రి అత్తలూరి విజయలక్ష్మి హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. కెనడాలో స్థిరపడిన నవీన్ చంద్ర భౌతికశాస్త్రవేత్తగా 50 ఏళ్లు పనిచేశారని అన్నారు. కవిగా, సాహితీవేత్తగా తెలుగు రచయితలందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి, నిరంతరం ప్రోత్సహిస్తూ అనేక పుస్తకాలు అందిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి కామేశ్వరరావు, నెళ్లుట్ల ఇందుశ్రీ, గోపాలకృష్ణ, కృష్ణమూర్తి, ప్రమోద్, శర్మ, కిరణ్మయి, రాణి తదితరులు

నేడు ఇందిరాపార్కు వద్ద ప్రజాధర్నా

నల్లకుంట, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు ప్రారంభించాలని, ఛత్తీస్‌గఢ్‌లో జరుగుతున్న ఆదివాసీ జాతి హననాన్ని నిలువరించాలని, ఆపరేషన్ కాగర్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం(నేడు) ఇందిరాపార్కు వద్ద ప్రజాధర్నా తలపెట్టినట్లు సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పి.సూర్యం తెలిపారు. ఈ ధర్నాలో జస్టిస్ బి.చంద్రకుమార్, ప్రొఫెసర్ ఎం.కోదండరాం, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వి.సంధ్య, సాధినేని వెంకటేశ్వరరావు, జేవీ చలపతి రావు, ఆవునూరి మధు, కె.గోవర్ధన్‌తో పాటు పది కమ్యూనిస్టు పార్టీల నేతలు, హక్కుల సంఘం నేతలు హాజరవుతారని ఆయన తెలిపారు. ఈ ధర్నాలో ప్రజలు, ప్రజాస్వామికవాదులు, మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

'వారంలో అందుబాటులోకి అంబర్‌పేట స్విమ్మింగ్‌పూల్'

అంబర్‌పేట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): అంబర్‌పేటలోని అంతర్జాతీయ స్విమ్మింగ్‌పూల్ మరో వారం రోజుల్లో ప్రజలకు అందుబాటులోకి వస్తుందని కార్పొరేటర్ విజయ్‌కుమార్ గౌడ్ తెలిపారు. అంబర్‌పేట స్విమ్మింగ్‌పూల్‌లో చేపట్టిన మరమ్మతు పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సిబ్బంది, బీఆర్ఎస్ స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా వైద్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వాలు'

నల్లకుంట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వైద్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయని, బడ్జెట్ కేటాయింపులు కూడా తగిన విధంగా లేవని హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం (హెచ్‌సీఎఫ్) ప్రధాన కార్యదర్శి కె.వీరయ్య ఆరోపించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం (హెచ్‌సీఎఫ్), హైదరాబాద్ జిందాబాద్ సంస్థల ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్ ఉచిత మెడికల్ శిబిరానికి ఉచిత సేవలు అందిస్తున్న డాక్టర్ రాజు, డాక్టర్ నాగును సంస్థ నిర్వాహకులు శాలువాకప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీఎఫ్ ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసరావు, మోహన్‌నాయుడు, ఎం.శ్రీనివాసరావు, నాయకులు సంగీత, అస్మిత, నాగేష్, రాజమౌళి పాల్గొన్నారు.

కారు వెనక డోర్ తగిలి ఇద్దరికి గాయాలు

బర్కత్‌పుర, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళ నిర్లక్ష్యంగా కారు వెనక డోర్ తీయడంతో ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరు కిందపడి గాయాల పాలయ్యారు. కాచిగూడ పోలీస్‌స్టేషన్ అడ్మిన్ ఎస్సై డి.సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. అంబర్‌పేట శివం రోడ్డులో నివాసముంటున్న అంబికా(27) ఇంటికి వెళ్లడానికి సోమవారం సాయంత్రం రాపిడో బైక్ బుక్ చేసుకుంది. ఆ బైక్‌పై ఇంటికి వెళ్తుండగా బర్కత్‌పురలోని పీఎఫ్ కార్యాలయం సమీపంలో సోనిక (కారు నెంబర్ టీఎస్ 08 జేకే 1535) వెనక డోర్ తీసింది, అదే సమయంలో అక్కడికి వచ్చిన వారి బైక్ డోర్ తగిలి కిందపడిపోయింది. దీంతో అంబికా తలకు గాయం కాగా, రాపిడో డ్రైవర్ సాయికుమార్‌కు ఎడమ చేయి, ఎడమ కాలుకు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సాయికుమార్ కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అడ్మిన్ ఎస్సై తెలిపారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మధుసూదనాచారి

ప్రోత్సాహాన్నిచ్చేవి పురస్కారాలు

చిక్కడపల్లి, జూలై 7(ఆంధ్రజ్యోతి): పురస్కారాలు ఎంతో ప్రోత్సాహాన్నిస్తాయని ఎమ్మెల్సీ ఎస్.మధుసూదనాచారి అన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో సత్యసంగీత ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో సోమవారం త్యాగరాయగానసభలో సామాజిక చైతన్యమూర్తులకు, వైద్యులకు, వెండితెర సినీతారలు, కళాకారులకు ఆత్మీయ పురస్కారాల ప్రదానం, సీతారామ కల్యాణోత్సవ నృత్యాంజలి, సంగీత విభావరి కార్యక్రమం సత్యసంగీత అధ్యక్షుడు ఓంకార్‌రాజు పర్యవేక్షణలో జరిగాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మధుసూదనాచారి మాట్లాడుతూ సమాజానికి సేవలు అందించేవారిని, ప్రాణాలు నిలిపే వైద్యులను ఎంపిక చేసి వారిని సత్కరించడం అభినందనీయమన్నారు. బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహనరావు, శైలజ, శ్రీగణేశ్, హనుమంతరాయశర్మ, రాధిక, సుప్రియ, డి. మూర్తి, గాంధి, గీతాంజలి, వంశీ, వైఎస్ రామకృష్ణ, లలిత తదితరులు పాల్గొన్నారు.



ధృతి కేసరిని సన్మానిస్తున్న జాహ్నవి గ్రూప్ ఆఫ్ కాలేజీల చైర్మన్ పరమేశ్వర్, వైస్ చైర్మన్ లక్ష్మి

విజయాలు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): విజయాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని జాహ్నవి గ్రూప్ ఆఫ్ కాలేజీల చైర్మన్ పరమేశ్వర్, వైస్ చైర్మన్ లక్ష్మి అన్నారు. సికింద్రాబాద్‌లోని జాహ్నవి డిగ్రీ, పీజీ కాలేజీ వార్షికోత్సవాన్ని కింగ్‌కోఠిలోని శాలిమార్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జాహ్నవి కాలేజీ విద్యార్థిని ధృతి కేసరి ఐసీసీ యూ19 ఉమెన్స్ టీ20 వరల్డ్ కప్- మలేషియా 2025 టోర్నమెంట్‌లో భారత జట్టులో భాగమై చాంపియన్‌షిప్ గెలిచిన సందర్భంగా కాలేజీ తరఫున ఘనంగా సత్కరించారు. ఆమె విజయం విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందన్నారు. జాహ్నవి కాలేజీకే కాక తెలుగు రాష్ట్రాలకు గర్వకారణమని అన్నారు. ఈ సందర్భంగా విద్యారంగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, ట్రోఫీలు అందజేశారు. వార్షికోత్సవంలో విద్యార్థులు నిర్వహించిన సంగీతం, నృత్యాలు, యోగా, ఫ్యాషన్ షో, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉదయ్, అనసూయ, కాలేజ్ ఫ్యాకల్టీ, ఉద్యోగులు, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వెంకటసుబ్బమ్మ



వెంకటసుబ్బమ్మకు నియామకపత్రం అందజేస్తున్న సునీతారావు

చిక్కడపల్లి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా మేకల వెంకటసుబ్బమ్మ నియమితులయ్యారు. సోమవారం గాంధీభవన్‌లో తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు చేతులమీదుగా వెంకటసుబ్బమ్మకు నియామకపత్రాన్ని అందజేశారు. అనంతరం మేకల వెంకటసుబ్బమ్మ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ఆలిండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కాలాంబా, సునీతారావుకు ధన్యవాదాలు తెలిపారు.

మన ఆరోగ్యమే మన సంపద

చిక్కడపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మన ఆరోగ్యమే మన సంపద అని ప్రోగ్రెసివ్ సైకలజిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డా. హిప్నో పద్మాకమలాకర్ అన్నారు. పద్మాకమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్, నవభారత్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం అశోక్‌నగర్‌లోని పర్సనాలిటీకేర్ హాల్‌లో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మహిళలు ఆరోగ్యం అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. పద్మాకమలాకర్ మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే ప్రపంచం అభివృద్ధి చెందుతుందని అన్నారు. మహిళలు తమ మానసిక ఆరోగ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఆమె సూచించారు. టెక్నిక్స్ సాధన ద్వారా ఎలా ప్రశాంతంగా ఉండాలో కార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు ఆమె చేసి చూపించారు.

'ఉచిత శిక్షణా శిబిరాలను సద్వినియోగంచేసుకోండి'

కవాడిగూడ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఉచిత శిక్షణా శిబిరాలను నిరుద్యోగులు సద్వినియోగంచేసుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు వెంకటేష్ సూచించారు. జనహిత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉచిత శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను సోమవారం కవాడిగూడ బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముషీరాబాద్ చౌరస్తా సమీపంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు ఏసీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్, ఎయిర్‌కూలర్, గీజర్ రిపేరింగ్‌లో ఉచితంగా రోజుకు రెండు గంట చొప్పున 30రోజుల పాటు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ కూడా అందజేస్తారని తెలిపారు. ఇతర వివరాలకు ఎం.శ్రీనివాస్ సెల్ ఫోన్ నంబర్ 8106887523లో సంప్రదించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు పరిమల్‌కుమార్, శంకర్, సందీప్, శివరాజ్, జనహిత సేవా ట్రస్ట్ ప్రతినిధులు ఎం.శ్రీనివాస్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బైకులు చోరీ చేస్తున్న వ్యక్తి అరెస్ట్

అంబర్‌పేట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పార్కింగ్ చేసిన బైకులను దొంగతనం చేస్తున్న ఓ వ్యక్తిని అంబర్‌పేట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. డీఐ మల్లీశ్వరి తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 1న ఉదయం సాయిరాంగౌడ్ బాగ్ అంబర్‌పేటలోని తన ఇంటి ముందు ద్విచక్రవాహనాన్ని పార్కు చేసి ఇంట్లోకి వెళ్లాడు. కొద్దిసేపటి తరువాత ఇంట్లో నుంచి బయటకు వచ్చి చూడగా బైక్ కనిపించకపోవడంతో అంబర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించి బడంగ్‌పేట అల్మాస్‌గూడకు చెందిన వడ్ల శ్రీనివాస్ బైకు దొంగిలించినట్లు గుర్తించారు. అతడిపై నిఘా పెట్టి సోమవారం అరెస్టు చేశారు. మూడు బైకులు స్వాధీనం చేసుకొని శ్రీనివాసును రిమాండ్‌కు తరలించారు

దారి దోపిడీకి పాల్పడుతున్న ముగ్గురి అరెస్ట్

అంబర్‌పేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న అమాయకులను అడ్డగించి దారి దోపిడీకి పాల్పడుతున్న ముగ్గురిని అంబర్‌పేట పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. డీఐ మల్లీశ్వరి తెలిపిన వివరాల ప్రకారం.. అభిషేక్‌యాదవ్, షేక్ హుస్సేన్, మాసంబిష అనే వ్యక్తులు గోల్నాక లాల్‌బాగ్‌లో ఒకే గదిలో నివాసం ఉంటూ క్యాటరింగ్ పని చేస్తున్నారు. సోమవారం తెల్లవారుజామున 3గంటల సమయంలో షేక్ బాషా తన మిత్రుడు మాసంబిషతో కలిసి క్యాటరింగ్ పని చేసుకుని ఇంటికి వస్తున్నాడు. అదే సమయంలో లాల్ బాగ్ మసీదు వద్ద ముగ్గురు వ్యక్తులు అడ్డుకొని వారిపై దాడి చేసి రూ.7వేలు లాక్కున్నారు. ఈ విషయాన్ని వారు తమ మిత్రుడు అభిషేక్ యాదవ్‌కు తెలియజేశారు. దీంతో ఆయన అక్కడికి రాగా దోపిడీకి పాల్పడ్డవారు అభిషేక్ యాదవ్ పై కూడా దాడి చేసి అతన్ని గాయపరిచారు. వారు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంబర్‌పేట పోలీసులు దాడికి పాల్పడి డబ్బులు గుంజుకుంటున్న మహమ్మద్ ఖాజా, సయ్యద్ యూనిస్, సయ్యద్ అమీర్‌లను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు.